ప్రకృతి రమణీయం



కడప నగర శివార్లలోని చలమారెడ్డి పల్లె -మాచుపల్లె రహదారిలోని దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను కట్టి పడేస్తున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతాలను తలపించేలా పచ్చని చెట్లు ఒకవైపు, గలగలా పారుతున్న పెన్నానది నీటి సుడులు మరో వైపు ప్రజలను విశేషంగా ఆకర్శిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కొండ ప్రాంతంలో పచ్చదనం నెలకొనగా, మరోవైపు పెన్నా జలకళను సంతరించుకుంది. అలాగే రహదారి మలుపుల్లో పచ్చని చెట్లు ప్రజలను స్వాగతం పలుకుతున్నట్లు కనిపిస్తున్నాయి. ఈ రోడ్డున ద్విచక్ర వాహనాలతోపాటు ఇతర వాహనాల్లో వెళుతున్న ప్రతి ఒక్కరూ కొద్దిసేపు ఈ ప్రాంతంలో ఆగి కొద్దిసేపు ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. – ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



క్లుప్తంగా

బైక్‌లపై విన్యాసాలు చేస్తే చర్యలు తప్పవు

కడప అర్బన్ : యువత ద్విచక్ర వాహనాలపై విన్యాసాలు చేసినా, రేస్ డ్రైవింగ్ చేసినా చర్యలు తీసుకుంటామని కడప వన్‌టౌన్ సీఐ రామకృష్ణ హెచ్చరించారు. కడప నగరం బుగ్గ వంక పక్కన ఉన్న రోడ్లపై కొంతమంది యువత బైక్‌పై విన్యాసాలు చేశారు. వారిని అదుపులోకి తీసుకొని వారి కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. హరి టవర్స్ బుగ్గ వంక పరిసర ప్రాంతాల్లో రాష్ డ్రైవింగ్‌కి పాల్పడ్డ ముగ్గురు యువకులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం ప్రమాదకరమని పత్రాలు లేకుండా వాహనం నడిపితే జరిమానాలతో పాటు జైలుకు కూడా పంపించాల్సి ఉంటుందని హెచ్చరించారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు కూడా బాధ్యత తీసుకొని వారిని గమనించుకోవాల్సిన బాధ్యత ఉండాలని సూచించారు.

పోటీ పరీక్షలపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

కడప ఎడ్యుకేషన్: నేటి పోటీ ప్రపంచంలో కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌పై అవగాహన పెంచుకుని పరీక్షలకు సిద్ధం కావాలని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రిన్సిపాల్ సలీంబాషా పేర్కొన్నారు. బుధవారం ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మ్యాథమ్యాటిక్స్ రీజన్స్‌పై సర్టిఫికెట్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు రీజన్స్, అప్‌టెడ్, మెంటల్ ఎబిలిటిపై అవగాహన పెంచుకుని సాధన చేయాలని సూచించారు. తద్వారా విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలరన్నారు. డిపార్ట్‌మెంట్ ఇన్‌చార్జు గురివిరెడ్డి మట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ సర్టిఫికెట్ కోర్సుకి హాజరై స్కిల్స్‌ను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్సు కో ఆర్డినేటర్ స్వప్న, మాల్యాద్రి, విద్యార్థులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించాలి



చెత్త తరలించే విధానాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మనోజ్‌రెడ్డి

కడప కార్పొరేషన్: కడప నగరంలో వినాయక నిమజ్జనం సందర్భంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పూర్తిగా తొలగించాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్ రెడ్డి తెలిపారు. బుధవారం మార్నింగ్ విజిట్ లో భాగంగా ఆయన కడప నగరంలోని నార్త్ జోన్ పరిధిలో ఈ సందర్భంగా ప్రధాన రహదారులపై చెత్తను సమయానికి తొలగిస్తున్నారా లేదా అన్న విషయాన్ని పరిశీలించారు. అలాగే వినాయక నిమజ్జన ప్రాంతాలలో చెత్త పూర్తిగా తొలగించారా లేదా అని తనిఖీ చేశారు. ప్రతిరోజూ ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ తప్పనిసరిగా జరిగేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సిద్దవటం కోట ఉత్సవాలు జరపాలి



మాట్లాడుతున్న విద్వాన్ గానుగపెంట హనుమంతరావు

కడప సెవెన్‌రోడ్స్: కడప జిల్లాకు పూర్వం జిల్లా కేంద్రంగా వెలుగొందిన సిద్దవటం కోట చరిత్ర ఎంతో గొప్పదని, ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ కోట ఉత్సవాలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉందని దక్షిణ భారత పర్యాటక సంస్థ గౌరవ అధ్యక్షులు విద్వాన్ గానుగపెంట హనుమంత రావు కోరారు. బుధవారం కడపలోని కవయిత్రి మొల్ల సాహితీ పీఠం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిద్దవటం ప్రాంతంలో రాష్ట్రంలో ఎక్కడ లేనన్ని శివాలయాలు, ప్రాచీన దేవాలయాలు, శాసనాలు, శిల్ప సంపద ఉన్నాయన్నారు. పర్యాటక ప్రదేశాలను వెలుగులోకి తెచ్చేందుకు జిల్లాలోని కళాకారులను ఏకం చేసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల వారు తమకు దగ్గరలో ఉన్న ప్రాచీన పర్యాటక ప్రదేశాల వద్ద ప్రదర్శన చేసి ఎంట్రీలను పంపాలని సూచించారు. ఆర్టిస్ట్ ఆఫ్ ది ఇయర్ టైటిల్ గెలుచుకునేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. వివరాల కోసం 83097 10250 సెల్ నెంబర్ ను సంప్రదించాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు జ్యోతి జార్జి, ప్రధాన కార్యదర్శి మురికి నాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వైవీయూకు అరకొర నిధులు కేటాయించడం దారుణం

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయానికి మంత్రి నారాలోకేష్ కేవలం రూ. 10 కోట్లు కేటాయించడం దారుణమని ఆర్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ అన్నారు. బుధవారం కడపలోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ఇస్తున్న పది కోట్లు ఏ మూలకు సరిపోవన్నారు. రూ. 100 కోట్లు కావాలని ఆర్‌ఎస్‌ఎఫ్ డిమాండ్ చేయగా మంత్రి కేవలం పది కోట్లు మంజూరు చేశారన్నారు. ఈ నిధులతో ఏపనిని చేయాలో ఆయనే చెప్పాలన్నారు. ఆర్‌ఎస్‌ఎఫ్ గత నెల రోజులుగా వైవీయూకు రూ. 100 కోట్లు మంజూరు చేయాలని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆందోళన చేస్తున్నామన్నారు. ఇందుకుగాను ఆయన కంటి తుడుపుగా కేవలం పది కోట్లు కేటాయించారన్నారు. దీంతోపాటు వైవీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, లా, బిఎడ్ కోర్సుల ఏర్పాటులో కూడా మంత్రి మాట్లాడనే లేదన్నారు. వైవీయూ అభివృద్ధికి ఆర్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లావ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నగర కన్వీనర్ వంశీ, చెన్నకేశం, సాయి పాల్గొన్నారు.

ఘన సన్మానం



షేక్ ఉమైర్‌ను సన్మానిస్తున్న యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన షేక్ ఉమైర్‌ను జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య, ఇబ్రహీం మియ్యా, దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిలాద్ ఉన్ నబీ వేడుకలు

కమలాపురం : దక్షిణ భారతదేశంలోనే ప్రఖ్యాతి గాంచిన కమలాపురంలోని దర్గా–ఈ–గఫారియాలో ఈనెల 4వ తేదీన సాయంత్రం మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ స్టేట్ జాయింట్ సెక్రటరీ, దర్గా కన్వీనర్ షేక్ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కమలాపురంలో భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న దర్గా–ఈ–గఫారియాలో ప్రతి ఏటా ఆసారే షరీఫ్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఆసారే షరీఫ్ అంటే వందల ఏళ్ల క్రితం మహ్మద్ ప్రవక్త, ఆయన కుటుంబ సభ్యులు వాడిన 100కు పైగా వస్తువులను ప్రదర్శిస్తారన్నారు. ఈ వస్తువులను మక్కా, మదీన, బాగ్దాద్, ఈజిప్ట్, తుర్కి తదితర దేశాల నుంచి తెప్పించినట్లు ఆయన వివరించారు. ఈ వస్తువులను నేరుగా చూస్తే వారి కోరికలు నెరవేరుతాయన్నారు. అలాగే వారికి ఆయురారోగ్యాలు, సంతానం, ఉద్యోగాలు పొందుతారని భక్తులు విశ్వసిస్తారన్నారు. అదే రోజు రాత్రి భారీ ఎత్తున అన్నదానం, అనంతరం బయాన్ ఉంటుందన్నారు. 5వ తేదీన ఉదయం జెండా ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. అనంతరం మిలాదున్నబి ప్రత్యేక దువా జరుగుతుందని, భక్తులు విరివిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇ-పంట నమోదు చేసుకోవాలి

కమలాపురం : పంటలు సాగు చేసిన రైతులందరూ తప్పని సరిగా తమ పంటలకు ఇ–పంట నమోదు చేసుకోవాలని ఏఓ సరస్వతి తెలిపారు. బుధవారం మండలంలోని గంగవరం, విభరాపురం గ్రామాలలో నిర్వహించిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె శాస్త్రవేత్తలు హేమలత, లీలావతి, మాధురిలతో కలసి పర్యటించారు. క్షేత్రస్థాయిలో మినుము, పెసర పంటలను పరిశీలించారు. రైతులకు సలహాలు, సూచనలు అందజేసి మాట్లాడారు. రైతులు తప్పని సరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని, వాటి ఫలితాల ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. అలాగే ప్రతి రైతు ఇ–పంట నమోదు చేసుకోవాలన్నారు. ఇ–పంట నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వ పథకాలు వర్తించవన్నారు. అలాగే రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌ఐసీని బలోపేతం చేయడానికి కృషి చేయాలి

కడప సెవెన్‌రోడ్స్ : జీవిత బీమా సంస్థను బలోపేతం చేయడం దేశాన్ని బలోపేతం చేయడమేనని ఎల్‌ఐసీ కడప డివిజన్ సీనియర్ డివిజనల్ మేనేజర్ జీకేఆర్‌వీ రవికుమార్ తెలిపారు. కడపలో బీమా వారోత్సవాల సందర్భంగా బుధవారం భారీ ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడారు. ఎల్‌ఐసీ సంస్థ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బీమా రక్షణ కల్పిస్తూ దేశంలో 27 కోట్ల మందికి వ్యక్తిగత పాలసీల ద్వారా సేవలందిస్తున్నదని తెలిపారు. ఎల్‌ఐసీ దేశ ఆర్థిక వ్యవస్థ లో దాదాపు 51 లక్షల కోట్ల రూపాయలు పైబడి పెట్టుబడులుగా పెట్టిందని అన్నారు. ఎల్‌ఐసీ సంస్థ కోసం పని చేసే 14.86 లక్షల ఏజెంట్‌లలో 49 శాతం పైబడి గ్రామీణ ప్రాంతాలనుంచే వచ్చారని అన్నారు. మహిళా ఏజెంట్ల సంఖ్య మూడు లక్షలు పైగా ఉంటే తాజాగా బీమా సఖి పేరుతో 2 లక్షలకు పైగా మహిళా ఎజెంట్‌లను ఎల్‌ఐసీ నియమించిందని అన్నారు. ఎల్‌ఐసీ సంస్థ దేశవ్యాప్తంగా ఉన్న 92 శాతం జిల్లాల్లో కార్యాలయాలు కలిగి ఉందని అన్నారు. తొలుత ఎల్‌ఐసీ జెండా ఊపి ఆయన ర్యాలీ ప్రారంభించారు. కడప నాగరాజుపేట ఎల్‌ఐసీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ జియోన్, ఉమెన్స్ కాలేజ్, పాత బస్టాండ్, సెవెన్ రోడ్స్, క్రిస్టియన్ లేన్, ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా సాగి మళ్లీ ఎల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయం వద్ద ముగిసింది. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ మేనేజర్ శ్యామసుందరరావు, మేనేజర్లు సత్య ప్రసాద్, లక్ష్మీకాంతమ్మ, రామకృష్ణ, సాల్మన్ రాజు, వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, శ్రీనాథ్ రెడ్డి, రమణయ్య, హరిప్రియ, సంఘాల నాయకులు నిత్యానంద రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, కిరణ్, రఘునాథ రెడ్డి, అవధానం శ్రీనివాస్, సుధీకర్, రామాంజనేయులు, రెడ్డి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉపాధ్యాయునికి సన్మానం

ఎల్‌ఐసీ డివిజన్ కార్యాలయంలో ఉత్తమ ఉపాధ్యాయుడు, రిటైర్డ్ ఇంగ్లీష్ అధ్యాపకుడు రహంతుల్లాను సన్మానించారు. రిటైర్డ్ ఎల్‌ఐసీ పెన్షనర్లు అందరికీ జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డీఎం, మార్కెటింగ్ మేనేజర్‌లతోపాటు పెన్షన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుధీకర్ తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులకు పాసింగ్ బాల్, అంత్యాక్షరి కార్యక్రమాలు నిర్వహించారు. వీటిని అధికారులు గాయత్రీ దేవి, బాబు నిర్వహించారు.



ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎస్‌డీఎం రవికుమార్

‘పది’ పారితోషికం పగటికలేనా..?

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షలు, మూల్యాంకన విధులకు సంబంధించిన పారితోషికం ఉపాధ్యాయులకు పగటి కలలాగా మారిపోయిందని యుటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. ఈ విషయమై బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి షేక్ శంషుద్దీన్‌ను కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మార్చి నెలలో జరిగిన పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్ , డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు పరీక్షల నిర్వహణకు సొంత డబ్బు ఖర్చు పెట్టుకుని విధులు నిర్వహించారన్నారు. అలాగే ఏప్రిల్ నెలలో జరిగిన పదవ తరగతి మూల్యాంకన పారితోషికం కూడా చెల్లించలేదని, పరీక్షలు ముగిసి ఫలితాలు వెలువడినప్పటికీ పారితోషికం చెల్లించడంలో అలసత్వం వహించడం ఏమిటని ప్రశ్నించారు. సప్లమెంటరీ పరీక్షల పారితోషికం కూడా కలిపి వెంటనే చెల్లించాలని కోరారు. ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షల విధుల్లో పాల్గొన్న చీఫ్ సూపరింటెండెంట్‌లు తమ సొంత డబ్బులు వేల రూపాయలు స్క్రైబర్లకు చెల్లించి పరీక్షలు సజావుగా జరిగేందుకు కృషి చేశారని అయితే డీఎస్సీ ఫలితాలు వచ్చి సర్టిఫికెట్‌ల పరిశీలన పూర్తయినా ఆ విధుల్లో పనిచేసిన వారికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా తక్కువ బడ్జెట్ ఉందంటూ కాలయాపన చేయడం సమంజసం కాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్, నాయకులు పాల్గొన్నారు.



డీఈఓకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

పరిపూర్ణ సంతోష ప్రదాత ఆరోగ్యమాత



ఆరోగ్యమాత సందేశాన్ని అందజేస్తున్న గురువులు



ప్రార్థనల్లో పాల్గొన్న విశ్వాసులు

కడప సెవెన్‌రోడ్స్ : ఆరోగ్యమాత విశ్వాసులకు పరిపూర్ణ సంతోష ప్రదాత అని రామకుప్పం విచారణ గురువు ఎం.చిన్నప్ప రాయర్ అన్నారు. కడప నగరంలోని ఆరోగ్యమాత ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజైన బుధవారం పలమనేరు విచారణ గురువులు రెవరెండ్ ఫాదర్ డి.జయపాల్ దివ్యబలిపూజ సమర్పించి మరియమాత సందేశాన్ని వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వాసులు దైవ చింతన అలవర్చుకోవాలన్నారు. విశ్వాసంతోపాటు అనుకరణ, ప్రార్థన కలిగి ఉండాలన్నారు. పిత, పుత్ర, పవిత్రాత్మల సంబంధాన్ని గుర్తెరిగి మసలు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా మరియమాత స్వరూపాన్ని కనులపండుగా అలంకరించి ప్రత్యేక పల్లకీలో ఉంచి చర్చి ప్రాంగణంలో విశ్వాసులు ఊరేగింపు నిర్వహించారు. రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు గురువులు, భక్తులు, కమిటీ సభ్యులు, విశ్వాసులు పాల్గొన్నారు.



విశేష అలంకారంలో ఆరోగ్యమాత స్వరూపం

జిల్లా సైన్స్ మ్యూజియాన్ని నూతనంగా ఏర్పాటు చేయాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలో ఉన్న జిల్లా సైన్సు మ్యూజియాన్ని నూతనంగా ఏర్పాటు చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శివరాం, గౌరవ సలహాదారుడు పిల్లా కుమార స్వామి రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం కడప చెన్నూరు బస్టాండ్ వద్ద ఉన్న సైన్సు మ్యూజియంను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా సైన్స్ మ్యూజియం చాలా అధ్వాన్న స్థితిలో ఉందని ఆందోళన చెందారు. జిల్లా సైన్స్ కేంద్రం లోపల పరిసరాలు చాలా అపరిశుభ్రంగా చెత్త చెదారం పేరుకుపోయి ఉన్నాయన్నారు. వీటితోపాటు బండలన్నీ అక్కడ కుప్పగా పోయడం వల్ల అవి తేళ్లకు పాములకు నిలయాలుగా మారాయన్నారు. సైన్సు మ్యూజియంలోని సైన్స్ పరికరాలను విద్యార్థుల కోసం ఉంచారన్నారు. కానీ కరోనా కాలం నుండి విద్యార్థులకు ఆ పరికరాలను చూపించిన దాఖలాలు లేవన్నారు. విద్యార్థులు పోవడానికి కూడా అనుకూలమైన పరిస్థితులు లేకపోవడమే దీనికి కారణమన్నారు. అధికారులు సమస్య పరిష్కరించాలన్నారు.



అధ్వాన్నంగా ఉన్న సైన్సు మ్యూజియంను చూపుతున్న జేవీవీ నాయకులు

రైతులకు యూరియాను అందించాలని వినతి

వల్లూరు : ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులందరికీ అవసరమైన యూరియాను ప్రభుత్వం పూర్తిస్థాయిలో అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం వల్లూరు మండల సమితి ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. ఖరీఫ్‌లో వర్షాలు ఆలస్యంగా కురిసినప్పటికీ కేసీ కెనాల్ పరిధిలోని ఆయకట్టు భూమితోపాటు, ఇతర ప్రాంతాల్లో బోరు బావులు కింద రైతులు పెద్ద ఎత్తున వరి పంటను సాగు చేశారన్నారు. అనేక కష్ట నష్టాలకు ఓర్చి ఎన్నో ఆశలతో వరి పంటను సాగు చేసిన రైతులకు అవసరమైన మేర యూరియా అందుబాటులో లేకపోవడంతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యాపారుల దగ్గర కూడా తగినంత యూరియా లేదని, ఒక వేళ వున్నా ఇతర ఎరువులు కొంటేనే యూరియా ఇస్తామని అనడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం అవసరమైన రైతులకు తగినంత యూరియాను సరఫరా చేసే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



డీటీకి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి

జనవిజ్ఞాన వేదిక మహాసభలను జయప్రదం చేయాలి



మహాసభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ వేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్: ఈ నెల 13, 14 తేదీలలో విజయనగరంలో నిర్వహించనున్న జనవిజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సమీర్‌బాషా, ప్రధాన కార్యదర్శి శివరాంలు కోరారు. బుధవారం కడపలోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన గోడపత్రాలను కోశాధికారులు రాజశేఖర్ రాహుల్ , సరస్వతి, వెంకటరమణ రాజు, నగర కార్యదర్శి నరసింహారెడ్డి, గౌరవ సలహాదారు పిల్లా కుమార్‌స్వామిరెడ్డి, మల్లెల భాస్కర్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు విజయనగరం జిల్లాలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతాయన్నారు.

ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించాలి

కడప రూరల్: ప్రైవేట్ విద్యా సంస్థల సమస్యలను పరిష్కరించాలని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్స) రాష్ట్ర అడ్మినిస్ట్రేటివ్ కార్యదర్శి బీ రామక్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి కే అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం రాత్రి చింతకొమ్మదిన్నె మండలం బుగ్గలపల్లెలో మంత్రి నారా లోకేష్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ బడ్జెట్ స్కూల్స్‌లో పనిచేసే ఉపాధ్యాయులకు వృత్తి పన్ను నుంచి మినహాయింపు కల్పించాలి తెలిపారు. సింగిల్ విండో సిస్టం ద్వారా ఒకేసారి అన్ని విద్యా సంస్థల సొసైటీలను రెన్యూవల్ చేసుకొనే వెసులుబాటు కల్పించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఆ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

లోప భూయిష్ట మూల్యాంకన విధానాన్ని రద్దు చేయండి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుడిని బోధనకు దూరం చేస్తున్న లోప భూయిష్టమైన ప్రస్తుత మూల్యాంకన విధానాన్ని రద్దు చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సురేష్ బాబు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ జి.శివారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, కడప నగర శాఖ అధ్యక్షుడు సాదిక్ అలీ డిమాండ్ చేశారు. ఈ విషయమై వైఎస్సార్‌జిల్లా పర్యటనకు విచ్చేసిన విద్యాశాఖ మంత్రి లోకేష్‌బాబుకు వారు వినతిపత్రాన్ని సమర్పించి విజ్ఞప్తి చేశారు.

ఇంటర్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఇంటర్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సురేష్‌కుమార్ కోరారు. ఇటీవలే నూతనంగా ఈ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయడంతో సంబంధిత అసోసియేషన్ పత్రాన్ని బుధవారం ఇంటర్ ఆర్‌జేడీ సురేష్‌బాబును కలిసి సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన అసోసియేషన్ అభివృద్ధి, ఉద్యోగుల సంక్షేమం కోసం అవసరమైన సూచనలు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ ఎడ్యుకేషన్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకు సత్కారం



మహిళలను సత్కరిస్తున్న వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం సభ్యులు

కడప ఎడ్యుకేషన్: భగవత్సంబంధమైన కార్యక్రమాలకు సేవలందిస్తున్న మహిళామణులను సత్కరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామని ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం, సనాతన ధర్మ సామూహిక ప్రార్థనా దేవాలయాల సంస్థ వ్యవస్థాపకులు కల్వ సోమ కళానాధరెడ్డి బుధవారం పాత కడప సనాతన ధర్మ సామూహిక ప్రార్థన దేవాలయాల సంస్థ ప్రాంగణంలో మహిళలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మూల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ తిరుమల, శ్రీశైలం, ఒంటిమిట్ట మొదలైన పుణ్యక్షేత్రాల్లో జరిగే ఉత్సవాల్లో అనేకమంది మహిళలు స్వచ్ఛంద సేవలు చేస్తున్నారని, వారి సేవాపథం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సత్కార కార్యక్రమంలో రచయితల సంఘం కార్యవర్గ సభ్యులు డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

దోమకాటు ఆరోగ్యానికి చేటు

పులివెందుల రూరల్ : దోమకాటు ఆరోగ్యానికి చేటు అని, ప్రతి ఒక్కరూ దోమ కాటుకు గురి కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొద్దీన్ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక మినీ సచివాలయంలో సీజనల్ వ్యాధులపై ఆరోగ్య కార్యకర్తలకు నిర్వహించిన అవగాహన కార్యక్రమం ఆయన పాల్గొని మాట్లాడారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ప్రతి రోజు మీకు కేటాయించిన గృహాలలో ఫీవర్, లార్వా సర్వేలు నిర్వహించాలని, ఎవరికైనా జ్వరం ఉన్నట్లయితే వెంటనే రక్త పరీక్ష చేయాలన్నారు. అనారోగ్యంతో ఎవరైనా బాధపడుతుంటే వెంటనే దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి మాత్రమే వెళ్లాలన్నారు. ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేస్తారన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో దోమల ఉధృతి అధికంగా ఉంటుందని, నీరు నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.